


పిల్లల ప్రపంచం!

నన్ను మీరూ, మిమ్మల్ని నేనూ అనుకరించవచ్చు. మాటతీరూ, నడిచే విధానం వగైరాలు మనిషికో తీరుగా ఉంటాయి. అయితే, అవి అనుకరణకి అసాధ్యాలుకావు. ఎవర్నయినా అనుకరించవచ్చుకానీ పసి పెధ వల్ని కాపీకొట్టడం కష్టసాధ్యం. వాళ్ళ ఆటపాటలన్నీ ప్రత్యేకం. వాటిని అనుకరించే ప్రయత్నం చేస్తే పరమ ఎబ్బెట్టుగా వుంటుంది. పిల్లల కోసం ప్రత్యేకించి ప్రపంచం వుంటుంది. ఆ ప్రపంచంలో మన పెద్దవాళ్ళకి చోటు లేదు. చూసి ఆనందించే మనసుంటే వాళ్ళ ఆటలు నిత్య నూతనంగా, మనో రంజికంగా వుంటాయి. వాడు కూర్చున్న చోటే ఒక ప్రపంచాన్ని సృష్టించు కుంటాడు. అదే ఇల్లు, అదే బడి. ఆ కొంచెం జాగాలో వాడు యెంతో పెద్ద ప్రపంచాన్ని తీర్చిదిద్దుకుంటాడు.

వాళ్ళు ఏ ఆట ఆడినా అది పరమ నిజంగానే భావిస్తారు. ఒకడు దొంగ, ఒకడు పోలీసు. ఆ ఆటలో ఆ కాసేపూ వాళ్ళ బంధుత్వాన్ని ఎంతో సీరియస్‌గా నమ్మేసి ఆ కేరక్టర్లలో మునిగిపోతారు. నన్నడుగుతే ఆ పాత్ర పోషణ క్లాస్ వన్‌గా చెబుతాను. హేమాహేమీలయిన కొద్దిరు ఆర్టిస్టులు కూడా ఆపాటి 'ఈజుని' ప్రదర్శించలేరని రాసిస్తాను. ఎంత కేరక్టరు ఆర్టిస్టయినా అతని వెనక డైరెక్టరంటూ ఒక శాస్త్రి వుంటాడు. పిల్లలకి అట్లాంటి ఏర్పాట్లుండవు.

పిల్ల వెధవలు ఆడుకుంటుంటే కొందరు పెద్దలకు చిరాకుగానే వుంటుంది. ఏమిటీ పిచ్చి ఆటలని విసుక్కుంటారు. మరీ ప్రాణం విసిగిపోతే రెండిచ్చుకుంటారు కూడాను. అంతేగాని ఆటలద్వారా వాళ్ళు చాటి చెప్పే జీవనసూత్రాలు పట్టించుకోరు. వాళ్ళు ఆడుకునే అమ్మా నాన్న ఆటలు చూసి అమ్మా నాన్నలు ఎట్లా వుంటారో సులువుగా అర్థం చేసుకోవచ్చు. అమ్మని నాన్న ఎప్పుడు ఎట్లా విసుక్కుంటాడో తెలుసుకోవచ్చు. నాన్న మీద అమ్మకి కోపం వస్తే ఏ విధంగా అలుగుతుందో కరెక్టుగా నటిస్తారు. వాళ్ళు పెద్దల్ని అవలీలగా అనుకరిస్తారు. పెద్దలు మాత్రం వాళ్ళని వీసమెత్తైనా అనుకరించలేరు.

మనం మన పై వాడికి తైరుకొట్టడంలో ఒక్కోసారి ఫెయిలయిపోతాం. బాసు వేసిన మురికి జోకు పొట్టపట్టుకొని పకపకా నవ్వేస్తాం. ఆ తర్వాత తన జోకులో పెద్ద విశేషం లేదని ఆ బాసుకి డవుటు కలిగితే నవ్వినందుకు మన గాలి తీసేస్తాడు. బాసుకి ముద్దుల బిడ్డేమోనని భ్రమపడి అతని కళ్ళముందే ఆ కుర్రాడ్ని ఎత్తేసుకుని ముద్దుల వర్షం కురిపిస్తాం. ఇంతటివాడి వంతటివాడివని ఊరికే స్తోత్రాలు చదివేస్తాం. వాడు మా పక్కింటి వారబ్బాయని బాస్ చెప్పినప్పుడు బ్రహ్మాండంగా వర్రీ అయిపోతాం. పిల్లల సంగతి అట్లాకాదు గురిచూసి కొడతారు. ఇంక ఆ దెబ్బకి తిరుగుండదంతే! ఫలానా సోముగాడికి వాళ్ళ నాన్నారు డీసెల్ రైలు తీసుకొస్తాడు. వాడు దాంతో బిజీగా వుంటాడు. తన రైలాట అందరూ చూడాలని కోరుకుంటాడేగాని తన రైలులో ఇతరులు ఎవ్వరూ ఆడకూడదని రూలు పెడతాడు. అంతవరకు బాగానే వుంటుంది. అల్లాంటి సోముగాడ్ని యింకో రాముగాడు ఎన్ని

మాటలు చెప్పి పడేసి ఆ రైలు తీసుకుంటాడో మీకై మీరు చూడాలేగాని రాస్తే పవరు తగ్గిపోతుందని నా భయం.

సాధారణంగా పిల్లలు వాళ్ళవాళ్ళ పెద్దలుచేసే ఉద్యోగాల ననుసరించి వాటి తాలూకు ఆటలే ఆడతారు. రైల్వేలో పనిచేసే పెద్దమనిషి పిల్లలు ఎక్కువగా రైలాటనే లైక్ చేస్తారు. ఫార్టీ వన్ డవుననో, ఎయిటీ ఎయిట్ అప్పనో ఊతపదాలు వాడతారు. అందరినీ మంచమెక్కించి దాన్ని రైలు చేసి టిక్కెట్లు తనిఖీ చేస్తారు. అట్లాగే ఆర్.టి.సి. కుటుంబాలు వాళ్ళ పిల్లలు నైట్ ఎక్స్‌ప్రెస్‌లని కొన్ని పీటల్ని లాక్కొస్తారు. డీలక్స్ సర్వీసు లని వాటిమీద తలగడలు వుంచుతారు. హారన్‌లు మోగిస్తారు. స్పీడుగా బస్సుల్ని నడుపుతారు. పిల్లవాడి ఆటను చూచి ఆ తండ్రి ఎక్కడుద్యోగం చేస్తున్నాడో ఈజీగా చెప్పొచ్చని శాయి నాతో అన్నాడు. అతని పిల్లలు రైలాట, మా పిల్లలు బస్సాటా ఆడుకోవటం చూస్తున్నాను గనుక అతని స్టేట్‌మెంట్ కరెక్టని వప్పుకున్నాను.

మనిషిఎదిగేకొద్దీ మనసుకూడా పెరుగుతుంది. తద్వారా రియాక్షనులు ఎక్కువవుతాయి. గాలి కొడితే వుబ్బిపోవడం, దెబ్బ తగిలితే రెచ్చిపోవడం పెద్దవాళ్ళ మన స్తత్వం. ఎదిగిన మనసు తత్వం. కుళ్ళు, కుచ్చితాలూ, దగా, కుట్రలూ ఆ మనసుకి బాగా అర్థమవుతాయి. అంచేత ఏ పాయింటు పట్టు కున్నా దాని అంతు చూడందే నిద్రపోరు. పిల్లల విషయం అట్లాకాదు. మనసెదగక పోడంవల్ల ప్రతి పాయింటూ ఒక ఆటగానే వుంటుంది. కొట్టు కోడమూ ఒక ఆటే. కలిసి ఆడుకోడమూ ఒక ఆటే. ఈసంగతి గమనించక పెద్దలు తొందర పడుతుంటారు.

మీ పిల్లాడు మా పిల్లను ముక్కు పచ్చడి చేసేడు గనుక మీ సంజా యిషీఏ మిటని ఈయనగారు పక్కింటాయన్ని అడుగుతాడు. మీవాడు మావాడి చొక్కాని చింపేడని ఆయనగా రంటాడు. మీదుత్త రౌడీ కొంపని ఈయన విరుచిస్తే. మీది కేవలం దగుల్బాజీవంశమని ఆయన రిమార్కుపాస్‌చేస్తాడు.

మాట మాట పెరుగుతుంది. గుప్పిట బిగిస్తారు, ముష్టియుద్ధం చేస్తారు. అట్లాగే ఆవిడగారు ఈవిడగార్ని దుర్భాషలాడుతుంది. ఈవిడగారు ఆవిడ గార్ని దుమ్మెత్తిపోస్తుంది. ఇళ్ళు ప్రక్క ప్రక్కనే వున్నా రెండు పార్టీలు వెలుస్తాయి. ఈ యింటిమీద కాకి ఆ ఇంటిమీద వాలడానికి వీల్లేదని బోర్డులు కట్టేస్తారు. ఇటు కొందరు, అటు కొందరు చేరిపోతారు. కొందరు వారికీ వీరికీ మూటలు మోస్తుంటారు. అందువల్ల విరోధం దినదినాభివృద్ధి చెందు తుంది. పిల్లల మూలంగా ఏర్పడిన విరోధం ఆ పెద్దల గుండెల్లో శాశ్వ తంగా కాపురం పెడితే పెట్టొచ్చుగాని అందుకు కారకులయిన పిల్లలు మరు క్షణమే కలిసిపోతారు.

వాడు వీడిని ఒరే ప్రసాదు అని ప్రేమగా పిలుస్తాడు. వీడు వాడ్ని కెసున్నారాయణ అని యింటి పేరుతో సహా పలకరిస్తాడు. ఇద్దరూ భుజాల మీద చేతులు వేసుకుని స్కూలుకి వెడతారు. వాడు తెచ్చింది వీడికి పెడ తాడు. వీడు తెచ్చుకున్న దాంట్లో వాడికి భాగమిస్తాడు. చొక్కా చింపిన సంగతి వాడిగ్గాని, ముక్కు పచ్చడి చేసిన విషయం వీడిగ్గానీ గుర్తుండదు. తన మూలంగా పెద్ద ముండావాళ్ళు తన్నుకుంటున్నారని కూడా గమనించరు. వాళ్ళ ప్రపంచంలో విరోధానికి అర్థంలేదు. అందుచేత విరోధానికి అర్థ మేమిటో తెలిసిన పెద్దలు పిల్లల ప్రపంచంలోకి అడుగుపెట్టడం, తద్వారా మొహా మొహాలు చూసుకోపోవడం ఘోరమైన నేరంగా ఎంచుకోవాలని నేను అనుకుంటూ వుంటాను.